ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -317 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 4 మార్చి 2026

# ఆగని మారణ హోమం

**787కు చేరిన మృతులు**

**విద్యార్థినుల భౌతికకాయాలు సాముహిక ఖననం**

**లెబనాన్ ప్రాంతాలను దురాక్రమణ చేసిన ఇజ్రాయిల్**

**డ్రోన్లు, క్షిపణులతో ప్రతిదాడి చేస్తున్న ఇరాన్**

టెహ్రాన్ : అమెరికా సామ్రాజ్యవాద కరాళనృత్యం 787 మంది ప్రాణాలను బలిగొంది. అమెరికా-ఇజ్రాయిల్ సేనలు, ఇరాన్ దళాల మధ్య వరుసగా నాలుగో రోజు కూడా భీకర పోరు కొనసాగుతుంది. మరోవైపు హిజ్బొల్లా కూడా రంగంలోకి దిగడంతో మధ్యప్రాచ్యంలో భయానక మిగతా 2లో...


## ఇరాన్ చర్చలకు ప్రయత్నించింది...

**ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను: ట్రంప్**

**ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి**

**ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు**





## పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌ను రాజ్యసభకు నామినేట్ చేసిన బీజేపీ

**జనవరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నితిన్ నబిన్**

**బీహార్‌లోని బాంకీపూర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నబిన్**

**నబిన్‌తో సహా తొమ్మిది మంది పేర్లను విడుదల చేసిన బీజేపీ**

**న్యూఢిల్లీ, మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను బీహార్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు నామినేట్ చేసింది. ఈ మేరకు ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బీజేపీ ప్రకటన విడుదల చేసింది. నితిన్ నబిన్‌తో పాటు మరో ఎనిమిది మంది పేర్లను బీజేపీ ప్రకటించింది. నితిన్ నబీన్ జనవరిలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్‌కు చెందిన ఆయన అంతకుముందు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. మిగతా 2లో...

# హనుమాన్ ప్రాజెక్టుకు డిప్యూటీ సిఎం శ్రీకారం

**ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం**

**అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు**

**ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్**



అమరావతి, **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎపి ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవంను మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని చెప్పారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ - వన్యప్రాణుల సంఘర్షణను నివారించి, సహాయం అందించే 'హనుమాన్' ఫౌండేషన్ ప్రాజెక్టును మిగతా 2లో...

## సుదీర్ఘ చర్చలు



**ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ..**

**సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు**

**ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్**

**గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ**

**జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం**

అమరావతి, **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' మిగతా 2లో...

## ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

**మోడీ తీరుతో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట**

**మోడీ తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. మిగతా 2లో...

## ఏపీ లిక్కర్ కేసు... ప్రణయ్ ప్రకాశ్ అరెస్ట్

**స్కామ్‌లో ఏ-52గా ఉన్న ప్రణయ్ ప్రకాశ్**

**నేపాల్ సరిహద్దుల్లోని సోనౌలీ చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్**

**విజయవాడకు తరలిస్తున్న సిట్ అధికారులు**



2లో.

## ఆకాశంలో కనువిందు

**రక్త వర్ణంలో దర్శనమిచ్చిన చందమామ**

**భారత్‌లో చంద్రోదయం తర్వాత కనిపించిన గ్రహణం**

**గ్రహణం సందర్భంగా పలు ఆలయాల మూసివేత**

**చంద్రగ్రహణం కారణంగా మూతపడిన తిరుమల ఆలయం**

**ఆలయ శుద్ధి అనంతరం దర్శనాలు పునఃప్రారంభం**



2లో.

# అంగన్‌వాడీలపై దమనకాండ

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ అంగన్‌వాడీలు**

**అక్రమ అరెస్టులను ఖండించిన పది పార్టీలు**



విజయవాడ, **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
వేతనాలు పెంచాలని కోరుతూ . శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పై ధమనకాండను ఖండిస్తూ?. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా అంటూ మిగతా 2లో...

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన**

**99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి**

**ఈ 99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు**

**మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు**

**గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల భగస్వామ్యం ఉండాలి**

**కలెక్టర్ల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు**



హైదరాబాద్,మార్చి 3(ఆర్ఎన్ఎ):
రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. 2లో...

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసు.. ప్రణయ్ ప్రకాశ్ అరెస్ట్

అమరావతి, **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
మదనపల్లి :- ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ52గా ఉన్న ప్రణయ్ ప్రకాశ్‌ను నేపాల్‌లోని సోనౌలీ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రణయ్ ప్రకాశ్‌పై ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు అతడిపై నిరంతరం నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే నేపాల్‌లోని సోనౌలీ చెక్‌పోస్ట్ వద్ద అతడు అడ్డంగా దొరికిపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని సంబంధిత అధికారులు నేపాల్‌లోని మహారాజ్ గంజ్ కోర్టులో హాజరపరిచారు. ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని విజయవాడకు తరలిస్తున్నారు. ప్రణయ్ ప్రకాశ్ అరెస్టుతో ఈ లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 17కు చేరింది. మద్యం టెండర్లు, లైసెన్సుల మంజూరులో జరిగిన అవకతవకలపై ప్రణయ్ ప్రకాశ్‌ను విచారిస్తే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సిట్ అధికారులు భావిస్తున్నారు. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీలో భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం సిట్ విచారణకు ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖులు, మద్యం వ్యాపారులపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. కాగా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించిన సూత్ర, పాత్ర దారులు ఇంకా పరారీ లోనే ఉన్నారు. వాళ్లు ఇంకా విదేశాల్లోనే తలదాచుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం జరిగి ఐదు నెలలవుతున్న సూత్రధారులు ఇంకా పరారీ లోనే ఉన్నారు. జోగి బ్రదర్స్ చేయని అక్రమ నకిలీ మద్యం తయారీ కేసు మోపించుకొని జైలుకు కూడా పొయొచ్చారు. నకిలీ మద్యం తయారీ సూత్ర పాత్రధారులుగా ఉన్న దాసరపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది మంత్రి గిరిధర్ రెడ్డి లను కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు భారతదేశానికి రప్పించలేదని ఎందుకు అరెస్ట్ చేయలేదనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం అవకతవకలపై పురోగతి సాధిస్తున్నా ఈ కూటమి అధికారంలోకి వచ్చాక ములకలచెరువు లో జరిగిన నకిలీ మద్యం తయారీ వ్యవహారాన్ని ఎందుకు గాలికొదిలేసిందనే చర్చ ప్రతి ఒక్కరిలో సాగుతోంది..

# ఆగని మారణ హోమం

**మొదటిపేజీ తరువాయి**
వాతావరణం కన్పిస్తోంది. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ మంగళవారం పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతంలో ఉన్న హిజ్బొల్లా టీవీ, రేడియో స్టేషన్ భవనాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తీవ్ర నష్టం వాటిల్లింది. హెజ్బొల్లాకు చెందిన అల్-మనార్ టీవీ ప్రసారాలు సుమారు గంట పాటు నిలిచిపోయాయి. శివారు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. అక్కడి ప్రజలను ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. మరోవైపు ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై అమెరికా-ఇజ్రాయిల్ సేనలు జరిపిన వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన 160 మంది అమాయక బాలికలను సాముహికంగా ఖననం చేశారు. వైమానిక దాడిలో బాలికల శరీరాలు ఛిద్రమై పోయాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన ఏడు ఎమిరేట్స్‌లో ఒకటైన ఫుజైరాలోని చమురు కేంద్రం నుంచి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. అంతకుముందు చమురు కేంద్రం పైకి దూసుకొచ్చిన డ్రోన్‌ను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అయినప్ప టికీ శకలాలు చమురు పరిశ్రమ జోన్‌లో పడడంతో మంటలు వ్యాపించాయి. అమెరికా దాడిలో ఇరాన్‌లోని భూగర్భ నతంజ్ ఫ్యూయల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఈపీ) ప్రవేశ భవనాలు కొంతమేర దెబ్బతిన్నాయని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ తెలిపింది. అయితే అణుధార్మిక పరిణామాలు సంభవించే ప్రమాదం ఏమీ లేదని చెప్పింది. ఇరాన్ సైనిక, ప్రభుత్వ కార్యాలయాలే లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులు జరపగా ఇరాన్ కూడా ప్రతీకార దాడులు జరిపింది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై పెద్ద ఎత్తున దాడులు చేసింది. దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో సంక్షోభం తీవ్రతరమైంది. భూతల దాడులు జరిపే అవకాశాన్ని తోసిపుచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. దీర్ఘకాల పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇజ్రాయిల్ మాత్రం భూతల దాడులు ఆచరణ సాధ్యం కావని చెప్పింది. మరోవైపు ఒత్తిడికి తలవంచబోమని, అయితే చర్చలకు సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ తెలిపింది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ప్రకటించింది. వ్యూహాత్మక సముద్ర మార్గంలో ప్రయాణించేందుకు ఏ నౌక అయినా ప్రయత్నిస్తే పేల్చివేస్తామని హెచ్చరించింది.

## ఇరాన్ చర్చలకు ప్రయత్నించింది...

**ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను: ట్రంప్**

యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.
ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.
వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**మొదటిపేజీ తరువాయి**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశు భ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# అంగన్‌వాడీలపై దమనకాండ

**మొదటిపేజీ తరువాయి**
అంగన్వాడీలు మండిపడ్డారు. వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిన్న ఉదయం నుండి 30 గంటల ధర్నా చేస్తున్న వేలాది మంది అంగన్వాడీలు నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున ధర్నా చౌక్ లో వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని 10 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అరెస్ట్ చేసిన అంగన్వాడీలను, వారి నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. దీనికి సంబంధించి మంగళవారం వామపక్షాలు ఓ ప్రకటనను విడుదల చేశాయి. నిద్రపోతున్న అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల మగ పోలీసులు అమానుషంగా వ్యవహరించారని, పిన్నులతో గుచ్చారనీ, మహిళలపైన తాళ్ళువేసి, ముసుగు గుడ్డ కప్పి బలవంతంగా వ్యాన్‌లలో కుక్కారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అంగన్వాడీల బ్యాగులు, సెల్‌ఫోన్‌లు తీసుకోనీయలేదు అని చెప్పారు. అంగన్‌వాడీ రాష్ట్ర నాయకులు బి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మతో సహా ఆయా సంఘాలకు చెందిన సుమారు వెయ్యి మందిని అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. అరెస్టయిన వారిని సుమారు



100 కిలోమీటర్ల దూరంలో పల్నాడు, ఏలూరు, నూజివీడు జిల్లాలోని నర్సారావుపేట, సత్తెనపల్లి, చాట్రాయి, బుట్టాయిగూడెం వగైరా సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లారని అన్నారు. ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకూ కాలకృత్యాలు తీర్చుకోనీయకుండా, వ్యాన్‌ల నుండి దింపకుండా అంగన్వాడీలను తిప్పారని చెప్పారు. మగ పోలీసులు దారుణంగా మహిళల పట్ల ఈ విధంగా వ్యవహరించడం అప్రజాస్వామికమని, ఇది నూటికి నూరుపాళ్లు మానవహక్కుల ఉల్లంఘనే అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు ఆందోళన చేసిన సందర్భంగా ఆనాటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీల ఉద్యమానికి మద్దతు ప్రకటించి, జీతాలు పెంచి న్యాయం చేస్తామని టిడిపి వాగ్దానం చేసింది? కానీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మాట తప్పి సమస్యలు పరిష్కరించకపోగా ఇప్పుడు వారిపైనే నిర్బంధానికి దిగడం దారుణమని, దీన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా నిరసిస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా అంగన్వాడీ యూనియన్ నాయకులతో వెంటనే చర్చించి వారి న్యాయమైన వేతనాల పెంపుదల తదితర డిమాండ్లను పరిష్కరించాలని పది వామపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.
----

# పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌ను రాజ్యసభకు నామినేట్ చేసిన బీజేపీ

**మొదటిపేజీ తరువాయి**
గత సంవత్సరం జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. బీహార్ నుంచి పార్టీ అధ్యక్షుడి స్థాయికి చేరిన తొలి నాయకుడిగా గుర్తింపు పొందారు. నితిన్ నబిన్‌తో పాటు రాజ్యసభకు వెళ్లనున్న వారి పేర్లను బీజేపీ విడుదల చేసింది.
బీహార్ నుంచి నితిన్ నబిన్‌తో పాటు శివేశ్ కుమార్ ఉన్నారు. అసోం నుంచి తెరాశ గోవాలా, జోగెన్ మోహన్, ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీవర్మ, హర్యానా నుంచి సంజయ్ భాటియా, ఒడిశా నుంచి మన్మోహన్ సమాల్, సుజిత్ కుమార్, పశ్చిమ బెంగాల్ నుంచి రాహుల్ సిన్హా ఉన్నారు.
10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. 10 రాష్ట్రాలలోని ఆరింటిలో బీజేపీ లేదా మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయి. దీంతో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోనుంది. రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న రాష్ట్రాలు మహారాష్ట్ర (7), తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బీహార్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హర్యానా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి.

# ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

**మొదటిపేజీ తరువాయి**
అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

# హనుమాన్ ప్రాజెక్టుకు డిప్యూటి సిఎంశ్రీకారం

**మొదటిపేజీ తరువాయి**
డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అందరికీ శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో నేడు కీలకమైన రోజన్నారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ - వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని
చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రాజెక్టులో 100 వాహనాలను అటవీ శాఖకు అందించామని పవన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19 అత్యవసర సహాయ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఏడు చోట్ల అత్యవసర చికిత్స, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన వారికి 4 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెచ్చి అడవి ఏనుగులను కట్టడి చేశామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉందని ఆయన అన్నారు. హనుమాన్ ప్రాజెక్టును పకడ్బంధీగా రూపొందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ ప్రదర్శనను పవన్ తిలకించారు. అటవీ వన్యప్రాణి సంరక్షణలో పాలుపంచుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖకు రెస్క్యూ వాహనాలు, అంబులెన్సులను డిప్యూటీ సీఎం పవన్ అందజేశారు.

# సుదీర్ఘ చర్చలు

**మొదటిపేజీ తరువాయి**
పాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది.
రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు.
టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు.
త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

# ఆకాశంలో కనువిందు

## రక్త వర్ణంలో దర్శనమిచ్చిన చందమామ

**భారత్‌లో చంద్రోదయం తర్వాత కనిపించిన గ్రహణం**

అమరావతి, **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
ఆకాశంలో ఓ అద్భుత ఖగోళ దృశ్యం కనువిందు చేసింది. ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రపంచవ్యాప్తంగా వీక్షకులను అలరించింది. భూమి నీడ చంద్రుడిపై పడటంతో, జాబిల్లి పూర్తి ఎర్ర రంగులోకి మారి 'బ్లడ్ మూన్' (రక్త చంద్రుడు)గా దర్శనమిచ్చింది. భారత్‌లోనూ ఈ చంద్రగ్రహణం పలు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది.భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:20 గంటల తర్వాత గ్రహణం ప్రారంభమైనప్పటికీ, ఆ సమయంలో చంద్రుడు దిగంతానికి దిగువన ఉండటంతో మన దేశంలో కనిపించలేదు. సాయంత్రం 6:26 గంటలకు చంద్రోదయం తర్వాతే గ్రహణాన్ని వీక్షించే అవకాశం లభించింది. ముఖ్యంగా సాయంత్రం 6:33 నుంచి 6:40 గంటల మధ్యలో గ్రహణం గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, చంద్రుడు తూర్పు దిక్కున ఎర్రని నారింజ రంగులో అద్భుతంగా కనిపించాడు. రాత్రి 6:47 గంటలకు గ్రహణం పూర్తిగా ముగిసింది.దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాలైన ఇండోర్ వంటి నగరాల్లో చంద్రోదయం సమయంలోనే గ్రహణం గరిష్ఠ దశలో ఉండటంతో, ప్రజలు ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించారు. ఈ ఖగోళ వింతను చూడటానికి ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకపోయింది.చంద్రగ్రహణం సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సంప్రదాయాల ప్రకారం 'సూతక్ కాలం' పాటించారు. ఉదయం గ్రహణం ప్రారంభానికి ముందే సూతక్ మొదలై, సాయంత్రం 6:47 గంటలకు గ్రహణం ముగిశాక పూర్తయింది. ఈ సమయంలో చాలామంది శుభకార్యాలకు దూరంగా ఉండి, ఉపవాసాలు పాటించారు. తిరుపతి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆలయాలను మూసివేశారు.
సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం ఏర్పడుతుంది. మళ్లీ ఇటువంటి సంపూర్ణ చంద్రగ్రహణం 2028 చివరి వరకు కనిపించదని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో ఈ అరుదైన దృశ్యాన్ని చాలా మంది తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# దొంగగా మారిన విద్యావంతుడు..

**- మహిళ మెడలోని బంగారు గొలుసులు, ఇళ్ళల్లో దొంగతనం చేస్తున్న మాజీ సాఫ్ట్వేర్ ఉద్యోగి అరెస్ట్..**

**- అతడి వద్ద నుంచి భారీగా నగదు స్వాధీనం.. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 03 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- మహిళల మెడలోని బంగారు గొలుసులు, ఇళ్ళల్లో దొంగతనం చేస్తున్న మాజీ సాఫ్ట్వేర్ ఉద్యోగిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. గతంలో పట్టణంలో ఒంటరిగున్న వృద్ధ మహిళల మెడలో బంగారు గొలుసులు, తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఎంటెక్ చదివిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ దొంగావతారం ఎత్తాడు. చివరకు పోలీసులకు చిక్కి అరెస్ట్ అయ్యాడు. జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలోని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం మీడియా సమావేశంలో నిందితుడిని చూపెడుతూ మాట్లాడారు. ఆయన



వెల్లడించిన వివరాల మేరకు మదనపల్లి పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీలో నివాసముండే కొరకూటి రాజేష్(35) పట్టణంలో ఇప్పటికే మూడు భారీ దొంగతనాలు చేశాడన్నారు. సీసీఎస్, వన్ టౌన్ పోలీసులు ఆ యువకుడు పై ప్రత్యేక నిఘా ఉంచి అతని కదలికలను సీసీ కెమెరా ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సంయుక్తంగా నిందితున్ని గుర్తించి పట్టుకున్నారు. అతడి వద్ద తనిఖీ చేయగా సుమారు రూ. 40లక్షల విలువ గల బంగారు, ఒక కేజీ వెండి సామాగ్రిని స్వాధీనపరచుకొని వాటిని సీజ్ చేసి ఆపై నిందితుడిని అరెస్టు చేసామని ఎస్పీ మీడియాకు వెల్లడించారు. యువత అత్యాశకు పోయి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే దురాశతో నేరాల బాట పట్టి బంగారు లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హితువు పలికారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, సీఐ రాజారెడ్డి, ఎస్సై రహీముల్లా సిబ్బంది పాల్గొన్నారు..

# - అంగన్వాడీల అక్రమ అరెస్టులపై సీఐటీయూ, ఏఐటీయూసీ ఆగ్రహం..

**- కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయి..**

**- చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుత ర్యాలీ చేపడితే అక్రమ అరెస్టులా..**

**ఏపీ బ్యూరో, మార్చి 03 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- వేతనాలను పెంచాలని కోరుతూ శాంతియుతంగా విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పై ధమనకాండను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అక్రమ అరెస్టులు చేస్తారా అంటూ అంగన్వాడీలు మండిపడ్డారు. వేతనాలు పెంచకుండా ప్రభుత్వం అంగన్వాడీల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలని కూడా చూడకుండా దుశ్శాసన ప్రవంగా ప్రవర్తిస్తూ టెంట్ లో నిద్రిస్తున్న వారిని నిద్ర లేపి లైట్లు ఆఫ్ చేసి ఎక్కడంటే అక్కడ చేతులు వేసి లాక్కెళ్ళే ప్రయత్నం చేశారని అంగన్వాడీలు ఆరోపించారు. విజయవాడ లోని ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇక విషయానికొస్తే విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఉద్రిక్తత



చోటుచేసుకుంది. తమ డిమాండ్లను పరిష్కరించాలని సీఎం నివాసం ముట్టడికి అంగన్వాడీలు పిలుపునిచ్చారు. దీంతో ధర్నా చౌక్లో దీక్ష చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్వాడీల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటిలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు మాట్లాడుతూ అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు వారిపై నిర్బంధ చర్యలకు దిగడం దుర్మార్గమని విమర్శించారు. మహిళల పట్ల గౌరవం ఉందని చెబుతూనే, ఇలా కిరాతంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు జిల్లా కేంద్రమైన మదనపల్లి లోను ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. విజయవాడలో మహా ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్ట్ చేశారని తక్షణమే వారిని విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, మదనపల్లి ప్రాజెక్టు అధ్యక్షురాలు మధురవాణి డిమాండ్ చేశారు. మదనపల్లి లోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున అంగన్వాడీలు హాజరై ధర్నా చేపట్టారు. విజయవాడలో మహా ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకొని అక్రమ అరెస్టులను ఖండించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

# వైయస్ జగన్ చేతుల మీదుగా చిన్నారులకు అన్నప్రాసన..

**మురిసిపోయిన చిన్నారుల తల్లిదండ్రులు..**







**ఏపీ బ్యూరో, మార్చి 03 - (రిపబ్లిక్ న్యూస్) -**
తాడేపల్లి లోని వైయస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని మంగళవారం చంటి బిడ్డల తల్లితండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి కోరిక మేరకు వైయస్ జగన్ చేతుల మీదగా అన్నప్రాసన కార్యక్రమాన్ని చేయించుకున్నారు. చంటి బిడ్డలను ఎత్తుకొని లాలిస్తూ అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ జగన్ చేతుల మీదగా తమ బిడ్డలకు అన్నప్రాసన జరిగిందని ఆయా చంటి బిడ్డల తల్లిదండ్రులు తెగ మురిసిపోయారు. నెల్లూరు జిల్లా కలిసి తమ తనయుడికి మీ చేతిలో అన్నప్రాసన చేయాలని నెల్లూరు జిల్లా వైయస్ఆర్సీపీ మహిళా విభాగం కార్యదర్శి శ్రావ్య రెడ్డి, జీవన్ రెడ్డి కోరారు. చంటి బిడ్డ శ్రియన్ రెడ్డిని వైయస్ జగన్ ఎంతో మురిపెంగా ఎత్తుకొని లాలించి అన్నప్రాసన చేశారు. చంటి బిడ్డను ఆశీర్వదించి తల్లితండ్రుల చేతికిచ్చారు. తమ తనయుడికి వైయస్ జగన్ చేతుల మీదుగా అన్నప్రాసన కార్యక్రమం జరిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు. మరొక కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట 18 వార్డు సభ్యుడు వైసీపీ నాయకుడు చిట్లూరి వెంకటేష్, లక్ష్మి చంద్రిక గారాల పట్టి ఆర్యన్ కు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టాలని తాడేపల్లి లోని వైసిపి కేంద్ర కార్యాలయానికి విచ్చేశారు. వైయస్ జగన్ ను కలిసి మీ చేతుల మీదగా తమ బిడ్డకు అన్నప్రాసన కార్యక్రమం చేయాలని కుటుంబ సభ్యులకు కోరారు. సమ్మతించిన వైయస్ జగన్ వారి కోరికను తీరుస్తూ చిన్నారి ఆర్యన్ ను ఎత్తుకొని లాలిస్తూ ముసి ముసి నవ్వులతో చిన్నారి చేస్తున్న చేష్టలను చూస్తూ అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. చిన్నారి తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తూ తమ బిడ్డకు జగనన్న చేతుల మీదుగా అన్నప్రాసన కార్యక్రమం జరిగినందుకు వెంకటేష్ కుటుంబ సభ్యులు సంబరపడ్డారు..

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

**--ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర్ రెడ్డి**

**ఎమ్మిగనూరు, మార్చి, 3,(రిపబ్లిక్ న్యూస్ ):** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.
ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు ఎమ్మిగనూరు పట్టణ మూడు మండలాలకు గాను 34 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 16 కోట్ల 71 లక్షల రూపాయలను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు అందుకుగాను ఎమ్మిగనూరు పట్టణ ఎస్సీ కాలనీ కి చెందిన మేరీషా వైఫ్ ఆఫ్ అడ్డాకుల జమ్మన్న బాధితులకు గాను ఎమ్మెల్యే కొంత చొరవ తీసుకొని 35 వేల రూపాయలు చెక్కు రూపంగా





అందజేశారు అందుకు గాను నవ్యాంధ్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కిని కూటమి ప్రభుత్వానికిని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు థాంక్స్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరి కోట షాలేము తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్..

**24 ఖరీదైన బైక్‌ల స్వాధీనం..**






**ఏపీ బ్యూరో, మార్చి 03 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- రాయచోటిలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న కిలాడీ దొంగను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. రాయచోటిలోని ఇందిరమ్మ కాలనీ కి చెందిన షేక్ ఆరిఫ్ (38)తో పాటు ముగ్గురు రిసీవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీళ్లల్లో ప్రధాన నిందితుడు ఆరిఫ్ 2024 ఆఖరి నుండి దొంగతనం బాట పట్టినట్టు జిల్లా ఎస్పీ వెల్లడించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ మంగళవారం మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడి వద్ద నుండి సుమారు రూ. 40 లక్షల విలువైన 17 రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లు, 5 పల్సర్ సహా మొత్తం 24 బైక్‌లను పీలేరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలాసాలకు అలవాటు పడి పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళాలు విరగ్గొట్టి ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

# ఆసుపత్రికి జబ్బుచేసింది....

## సిబ్బంది కొరతతో అవస్థలు




**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 03 రిపబ్లిక్ న్యూస్ ం** మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి జబ్బు చేసింది అనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ పనిచేస్తున్నటువంటి సిబ్బంది డ్యూటీ అనంతరం రిలీవర్ రాకుండానే డ్యూటీ వదిలి వెళ్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ సిబ్బంది కొరత ఎక్కువగా ఉండటంతో ఎనిమిది గంటలు డ్యూటీ చేయాల్సిన సిబ్బంది 12గంటలు డ్యూటీ చేస్తున్నారు. అంతే కాకుండా సమయానికి డ్యూటీకి రావడంలేదన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండాగా ఇక్కడ ఉన్న వైద్యులు ఒకరు మామూలుగా క్యాంపు వెళ్తుంటారు. 104 కు అందుబాటులో ఉంటున్నారు. ఇక్కడ సిబ్బంది కొరత ఉంది. కాబట్టి ఉన్నతాధికారులు వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదైనా జబ్బుతో ఆసుపత్రికి వస్తే స్టాఫ్ నర్స్ లే డాక్టర్ గా సేవలందిస్తున్నారు. మామూలుగా డ్యూటీలు రొటేషన్ పద్ధతిలో ఉండాల్సింది. ఇక్కడ అలా కాకుండా ఎలా పడితే అలా ఎవరికి ఇష్టమొచ్చినట్లుయు నడుచుకుంటున్నారు. కావున ఇకనైనా అధికారులు స్పందించి సిబ్బందిని ఏర్పాటు చేసి, రొటేషన్ పద్ధతిలో డ్యూటీలు కేటాయించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా బోయకొండ ఆలయం మూసివేత

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 03 రిపబ్లిక్ న్యూస్**
చంద్రగ్రహణం సందర్భంగా బోయకొండ ఆలయాన్ని మూసివేశారు గ్రహణం మూడు గంటల నుంచి ప్రారంభమవుతుందని కాగా అంతకుముందే ఉదయం 9 గంటలకే మూసివేసినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు మరుసటి రోజున బుధవారం ఆలయ శుద్ధి అమ్మవారి అభిషేకంతో దర్శన భాగ్యం కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



# చెరువులో వ్యక్తి అనుమానస్పద మృతి

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 03 రిపబ్లిక్ న్యూస్**
చెరువులో పడి ఓ వ్యక్తి అనుమానాతస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది కుటుంబ సభ్యులు గ్రామస్తుల కథల మేరకు... మండలంలోని కాటిపేరు పంచాయతీ పలగార్లపల్లికి చెందిన వెంకటరమణ (48) వ్యవసాయ కూలీల జీవిస్తున్నాడు ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయాడు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికిన ప్రయోజనం లేకపోయింది కాగా మంగళవారం సాయంత్రం పలగార్లపల్లి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే మార్గంలో గల ఒక చెరువులో శవమై తేలాడు గుర్తించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# టెన్త్, ఇంటర్ విద్యార్థినిలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

### :- డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు





**పాములపాడు మార్చి 3 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు ఆదర్శ పాఠశాల హాస్టల్ లో ఉన్న టెన్త్, ఇంటర్ విద్యార్థినిలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని సందర్శించి డివిఎంసి మెంబర్ ఎల్.నాగరాజు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మీరందరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాటలను శ్రద్ధగా విని, మీరు బాగా చదివి ఉన్నత స్థాయికి పోవాలని ఆయన అన్నారు. మీ పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. మీరు పబ్లిక్ పరీక్షాలని భయపడకుండా నిర్భయంగా రాయాలని, కష్టపడితే సాధించలేనిది ఈ లోకంలో ఏదీ లేదని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థినీయులకు ఏర్పాటుచేసిన భోజనాన్ని కూడా తనిఖీ చేయడమైనది.

# మహానంది ఆలయ తలుపులు మూసివేత

### - సంప్రోక్షణ పూజల తర్వాత దర్శనం





**మహానంది, మార్చి 3, (రిపబ్లిక్ న్యూస్)**
కేతు గ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మహానంది ఆలయ తలుపులు మూసివేశారు. మంగళవారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ, ఆలయాల ఉప ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు గ్రహణ ముందు కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయ తలుపులు మూసివేశారు. తిరిగి రాత్రి 7 గంటలకు సంప్రోక్షణ, ఆలయ శుద్ధి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.ద

# డ్రైనేజీల్లో తాగునీటి పైపుల మార్పు చేపట్టాలి

### ప్రజారోగ్య రక్షణకు ప్రజల సహకారం అవసరం కమిషనర్ పి. విశ్వనాథ్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)**



నగరంలోని డ్రైనేజీ కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్ల మార్పు కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇంజనీరింగ్, అమినిటీస్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, కలుషిత నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి అమినిటీస్ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పర్యటించి అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో నగరపాలక సంస్థకు చెందిన పైప్‌లైన్ల మార్పుకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన పైప్‌లైన్‌ల నుంచి గృహాలకు తీసుకున్న కనెక్షన్ పైప్‌లు డ్రైనేజీ కాలువల్లో ఉన్నట్లయితే, వాటి మార్పు అవసరాన్ని సంబంధిత యజమానులకు తెలియజేయాలని సూచించారు. యజమానులు అవసరమైన సామాగ్రి అందిస్తే మున్సిపల్ సిబ్బంది వెంటనే మార్పు పనులు చేపడతారని స్పష్టం చేశారు.డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు ఉండడం వల్ల కలుషిత నీటి సమస్యలు తలెత్తి అతిసారం వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని కమిషనర్ తెలిపారు. ప్రజల సహకారం లేకుండా ఈ పనులు పూర్తికావని, ప్రతి ఇంటి యజమాని బాధ్యతగా స్పందించి స్థానిక సచివాలయంలో అమినిటీస్ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.సమావేశంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# పద్మచంద్ర నర్సింగ్ హాస్టల్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన

### మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థినులకు హెల్ప్‌లైన్ నంబర్లపై సూచనలు



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)**



జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమశాఖ అధికారిని పి. విజయ ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజు కార్యక్రమాన్ని పద్మచంద్ర నర్సింగ్ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సైబర్ క్రైమ్‌లు, వాటి నివారణ చర్యలు మరియు అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు.వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ ఐ. విజయకుమారి సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఏ.ఎస్.ఐ జి. శ్రీనివాస్ సైబర్ నేరాల బారిన పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పారా మెడికల్ పి. రేష్మా, హాస్టల్ సిబ్బంది ఎన్. శ్వేత, జి. దీప పాల్గొన్నారు. విద్యార్థినులు ఆసక్తిగా కార్యక్రమాన్ని వినిపించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# అంగన్వాడీల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

### అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి, వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి:-సిఐటియు డిమాండ్




**పాములపాడు మార్చి 3 రిపబ్లిక్ న్యూస్:-**
విజయవాడలో శాంతియుతంగా తమ సమస్యల పరిష్కారం కోసం అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ దగ్గర ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు మరియు ఆందోళనలో పాల్గొన్న అంగన్వాడీలను తెల్లవారు జామున నిద్రపోతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు గా తీవ్రంగా ఖండిస్తున్నామని ఆరెస్టు చేసిన అంగన్వాడీలను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని సమస్యలు సామరస్యంగా పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.బాలయ్య ల ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి వర్కర్లకు కనీస వేతనం 26,000/- ఇవ్వాలని, హెల్పర్లకు 20,000/- ఇవ్వాలని, గ్రాట్యూటీ, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని,పని భారాలు తగ్గించాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలని, లబ్ధిదారులకు పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కొరకు 42 రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా గత వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే అప్పుడు వేతనాలు పెంచుతామని మినిట్స్ రూపంలో హామీలు ఇవ్వడం జరిగిందని అయితే ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయిందని గుర్తు చేశారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు కూడా మేము అధికారంలోకి వస్తామని సమస్యలు పరిష్కరిస్తామని వారు కూడా హామీ ఇవ్వడం జరిగిందని తీరా అధికారంలోకి వచ్చి, 19 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని శాంతియుతంగా ఆందోళన బాట పట్టిన అంగన్వాడీల పట్ల గత ప్రభుత్వం మాదిరిగానే నిర్బంధ కాండ కొనసాగిస్తున్నారని ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేదంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు, నాగమణి, మద్దమ్మ, రమణమ్మ, సుశీలమ్మ, రామసుబ్బమ్మ, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నులతోనే నగర అభివృద్ధి

### మార్చి 31 వరకు సెలవు రోజుల్లోనూ పన్ను వసూళ్లు నగరపాలక మేనేజర్ యన్. చిన్నరాముడు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)**
నగర ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగలమని నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూళ్ల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో, పన్ను చెల్లింపుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారాలు, పండుగల వంటి సెలవు దినాల్లో కూడా ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుములు చెల్లించవచ్చని చెప్పారు.
నగరపాలక కార్యాలయంతో పాటు నగరంలోని వివిధ



ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయం, కేఎంసి పాత కార్యాలయం, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయం, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయం, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయం, లక్ష్మి నగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో పన్ను వసూళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు.
ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని, యూపీఐ ప్లాట్‌ఫాంలు మరియు ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చని సూచించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పోలీసుల సంక్షేమమే ముఖ్యం- ఎస్పీ విక్రాంత్ పాటిల్

### అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)**
మార్చి 8న జరగబోయే ఇంటర్నేషనల్ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు విక్రాంత్ పాటిల్ తెలిపారు.పోలీసుల సంక్షేమమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, మహిళా సాధికారతలో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి తగిన సూచనలు, సలహాలు పొందారు. ఈ శిబిరంలో మొత్తం 185 మంది సిబ్బందికి రక్తపోటు, షుగర్, ఈసీజీ, టూడీ ఈకో, పీఎఫ్‌టీ, బీఎండీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.
అనంతరం వైద్యుల బృందాన్ని ఎస్పీ అభినందించి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.
ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్రబాబు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్లు మంజునాథ్, రఘునందిని, సువర్ణ, సింధూర, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసుధన్ రావు, మహిళా పీఎస్ సీఐ రామయ్యానాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాల వల్ల పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది

### పంచలింగాల గ్రామంలో 'బాల్య వివాహ విముక్తి భారత్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)**
బాల్యం అనేది ప్రతి చిన్నారి జీవితంలో అత్యంత అమూల్యమైన దశ అని, అలాంటి దశలో జరిగే బాల్య వివాహాలు వారి చదువు, ఆరోగ్యం, శారీరక మరియు మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు.
'బాల్య వివాహ విముక్తి భారత్' పేరుతో కోనేరు ఎన్.జీ.ఓ సంస్థ మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల కారణంగా పిల్లల విద్య మధ్యలోనే ఆగిపోతుందని, దీని వల్ల వారు జీవితాంతం అనేక సామాజిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. సమాజంలో ఇంకా కొనసాగుతున్న ఈ దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలందరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని బాల్య వివాహాలను అరికట్టాలని ఆయన సూచించారు. ప్రతి చిన్నారి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని స్వయం ప్రతిభతో ఎదగడానికి అనుకూల వాతావరణం కల్పించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కోనేరు సంస్థ కోఆర్డినేటర్ మౌనిక, సి.ఎస్.ఎం రామాంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్ మునుస్వామి, గ్రామ ఆశా వర్కర్లు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# రైతన్నలంటే మరి ఇంత అలుసా..

**- సోమరిపోతులా వ్యవహరించిన ఈ అధికారులు..- వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నిండా మునిగిన రైతన్నలు..**

**- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్న రైతన్నలు..**

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 03 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రమైన దప్పేపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లకుండా వ్యవసాయ శాఖ అధికారులు సచివాలయంలోనే కూర్చొని పంట ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వైనం వెలుగులోకొచ్చింది. వ్యవసాయశాఖాధికారులు పంటలు సాగుచేసిన రైతులను, పంటలు సాగు చేయని రైతులను ఒకే గాటి కింద కట్టేస్తున్నారు. పంటలు సాగు చేసిన రైతుల పేర్లను పంట ఈ క్రాప్ బుకింగ్ లో పంట వెయ్యలేదని రావడంతో స్థానిక రైతన్నలు లబోదిబోమంటున్నారు.




గ్రామ సచివాలయ వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో పంటలు వేసిన రైతన్నలు నష్టపోయారు. ఇదెక్కడి న్యాయమని అడిగిన రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది పొంతనలేని సమాధానం చెప్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రతిరోజు 400కు పైగా ఈ క్రాప్ చేయాలని తమకు తమ పై అధికారులు ఒత్తిడి తెస్తుండడంతో తాము క్షేత్ర స్థాయికి వెళ్లకుండా సచివాలయంలోనే కూర్చొని ఇలా చేయాల్సి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ రైతన్నలకు తెలిపారు. తమ పరిస్థితెంటని రైతన్నలు ప్రశ్నిస్తూ అర్హులైన రైతులకు అన్యాయం చేశారని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవసాయ శాఖ అధికారిపై మరియు సిబ్బంది పై కఠినమైన చర్యలు తీసుకోవాలని నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి రైతన్నలు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న తరుణంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం బాధ కరమని కూటమి ప్రభుత్వానికి రైతన్నలపై చిత్తశుద్ధే ఉంటే నిర్లక్ష్యంగా వహించిన వ్యవసాయ శాఖ అధికారులపై ఇబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతన్నలు కోరుతున్నారు..

# మహిళలే సమాజానికి మార్గనిర్దేశకులు

## ఐసీడీఎస్ పీడీ బద్వేలు శ్రీదేవి



**అనంతపురం సంక్షేమం, మార్చి 03,( రిపబ్లిక్ న్యూస్):**
మహిళలే సమాజానికి మార్గనిర్దేశకులని ఐసీడీఎస్ జిల్లా పీడీ బద్వేలు శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నీలంపల్లి గ్రామ ఆలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాతా శిశు సంక్షేమం, మహిళా సాధికారత, బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీ, డిజిటల్, సైబర్ క్రైమ్, ఆన్ లైన్ అరెస్ట్ వేధింపులు వంటి అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. పీడీ బద్వేలు శ్రీదేవి, డీఎంసీ ఉరవకొండ శ్రీదేవి, డీసీపీఓ రామన్నగారి మంజునాథ, సఖి మేనేజర్ శాంతామణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పై అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవీసీ లీగల్ కౌన్సిలర్ నర్మద, సఖి సెంటర్ ఉద్యోగులు రాజ్యలక్ష్మి, మంజుల, దుర్గా, శ్రీకళ, పోలీస్ అధికారులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# చెర్లోపల్లిలో ఘనంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం





**గుత్తి మార్చి 03 (రిపబ్లిక్ న్యూస్ )**
అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెన్నకేశవ స్వామి రథోత్సవం మంగళవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి చుట్టుపక్కల పది గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని రథంపై ప్రతిష్ఠించి చెర్లోపల్లి గ్రామ సమీపం వరకు ఊరేగించారు. ఆలయం వద్ద చెన్నకేశవ స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి సర్పంచ్ వెంకటేష్ మాజీ సర్పంచ్ మల్లికార్జున పి చిరంజీవి హనుమంతు అప్ప రామన్న వెంకటరామయ్య శంకరయ్య రాము నాగరాజు భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# చిప్పగిరి లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు





**చిప్పగిరి, మార్చి,3,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పిగిరి స్థానిక గుంతకల్ రోడ్డు నందు ఎస్ఐ సీవీ. నరసింహులు మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు, ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను ఆపి వారికి బ్రీత్ ఎన్లైజర్ తో తనిఖీలు చేశారు ,మద్యం సేవించి వాహనాలు నడిపిన ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయిన, అనుమతి పత్రాలు లైసెన్స్ లేకపోయిన,చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీవీ నరసింహులు హెచ్చరించారు, ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది సుబ్రహ్మణ్యం,మురళీకృష్ణ పాల్గొన్నారు.

# మనసుపెట్టి చదవండి

# మంచి మార్కులు సాధించండి,

**-మహేష్ నాయుడు.**




**ఓబులవారిపల్లి మార్చి 3 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం చిన్నఒరంపాడు కడప చెన్నై రహదారి లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో హెడ్మాస్టర్ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మహేష్ నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్చి 16వ తేదీ నుండి మొదలుకానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మనసుపెట్టి ప్రణాళికాబద్ధం గా చదువుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు. ఆందోళన, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని అప్పుడే చదువుకున్నది గుర్తుంటుందని తెలిపారు. మనసు పెట్టి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు చదివి విద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన విద్యార్థులకు హితబోధ చేశారు . అదేవిధంగా పల్లెల్లో తల్లిదండ్రులు మొండిగా పదవ తరగతి అనంతరం ఆడపిల్లలకు వివాహం చేయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు వీలైతే ఆ తంతు కూడా ముగించేస్తారు,ఆ వయసులో వివాహం చేయడం చట్టరీత్యా నేరం బాల్య వివాహాలు.చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే అనర్థాలను ఆయన విద్యార్థులకు వివరించారు. అందువల్ల తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో ఉన్నతముగా ఆలోచించాలని పెళ్లి వయసు వచ్చేవరకు వారి చదువుకు ఎలాంటి ఆటంకం కలక్కుండా వారి ఉన్నత చదువుల కోసం పాటుపడాలన్నారు చిన్న వయసులో పెళ్లిళ్లు జరగకుండా చూడాలని లేనిపక్షంలో స్థానిక సచివాలయ పరిధిలోని అధికారులకు, లేదా మీరు చదువుకున్న పాఠశాల సిబ్బందికి అలాగే పోలీస్ స్టేషన్లకు సంబంధించి 100 టోల్ ఫ్రీ కి ఎవరైనా ఫిర్యాదు చేయడం ద్వారా బాల్య వివాహాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై పోలీసుల ఉక్కుపాదం

**8 మంది పై రౌడీ షీట్ ఓపెన్**

**జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరిక**




**హిందూపురం, మార్చి 03 (రిపబ్లిక్ న్యూస్)**
ఇటీవల నిర్వహించిన చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హిందూపురంలో ర్యాలీ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై పోలీసుల ఉక్కు పాదం మోపారు. 19 ,20 సంవత్సరాల ఇద్దరు యువకులు అరెస్టు 196 బి ఎన్ ఎస్ ఐ టి యాక్ట్ 299 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు కోర్టులో పోలీసులు హాజరు పరచారు. సోషల్ మీడియాలో మతఘర్షణలో రెచ్చగొట్టేలా పోస్టులు ఫార్వార్డ్ చేసిన మరో ఆరుగురికి 41 ఏ నోటీసులు అందజేసి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. 8 మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నామని 18 ,19 ఏళ్లకే రౌడీషీట్ పొందుతున్నారంటే భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించుకోండి అంటూ జిల్లా ఎస్పీ సూచించారు మరోసారి ఇలాంటివి రిపీట్ అయితే పీడి యాక్ట్ తో పాటు నగర బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న హిందూపురంలో కులాలు, మతాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మంగళవారం మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఇటువంటి నేరాలకు పాల్పడితే భవిష్యత్తులో ఉద్యోగాలకు వెళ్లే సమయంలో పోలీసు శాఖ నుంచి ఎన్వోసీ లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ఖాతాలలో ఎటువంటి పోస్టులు వచ్చిన అడ్మిన్ గా ఉన్నవారు పూర్తి బాధ్యత వహించాలి. యువత సోషల్ మీడియా వినియోగించడంలో దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిస్తే తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. అన్ని కులాలు మతాల వారు కలిసి మెలిసి ప్రశాంత జీవనం సాగించాలి, ఎవరి మత విశ్వాసాలను మరొకరు తక్కువ చేసి చూపరాదనీ సూచించారు. యువతా మేలుకో... చేతిలో మొబైల్ ఫోన్ , ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అందుబాటులో ఉందని ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ కులాలు, మతాలు మధ్య చిచ్చు పెట్టేలా పోస్టులను పెడితే తాట తీస్తామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు.
హిందూపురంలో ఇటీవల చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీ ఘటనకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి మతాల మధ్య చిచ్చుపెట్టేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. ఈ పోస్టులను క్రియేట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు (19, 20 సంవత్సరాలు) యువకులను అరెస్టు చేసి 196 బి.ఎన్.ఎస్, ఐటి యాక్ట్, 299 ,బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ డీఎస్పీ కేవీ మహేష్ తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జిల్లా యువతకు వారి తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. అనంతరం యువతతో సమావేశం నిర్వహించి సత్ప్రవర్తనతో మంచి మార్గంలో నడవాలని ఎస్పీ యువతకు సూచించారు.
ఈ మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ డిఎస్పి తో పాటు, సి ఐ లు, రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కె .జనార్ధన్, కరీం ,ఎస్సైలు పాల్గొన్నారు.

# ఘనంగా ఇవాన్ రెడ్డి జన్మదిన వేడుకలు







**మంత్రాలయం, మార్చి, 3,(రిపబ్లిక్ న్యూస్ ):**
యాదృచ్ఛికంగా జరిగిందో ఆ దేవుడు సంకల్పం ఏమో తెలియదు గానీ యుద్ధ వాతావరణం నెలకొన్న దుబాయ్ దేశంలో జరగాల్సిన తన మనవడు పుట్టినరోజు నేడు స్వగ్రామమైన మాలపల్లి గ్రామంలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన సత్యా నారాయణ రెడ్డి అనే వ్యక్తి ఆనందం వ్యక్తం చేశాడు. సత్యానారాయణ రెడ్డి రాఘువేనమ్మ దంపతుల కుమార్తె దివ్య రెడ్డి, అల్లుడు తిప్పారెడ్డి దుబాయిలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే సరిగ్గా పది రోజుల క్రితం తల్లిదండ్రులు చూసేందుకు




దానితో పాటు గ్రామంలోనే తన కుమారుడు ఇవాన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించుకుని స్వగ్రామానికి చేరుకున్నారు. అయితే సత్యనారాయణ రెడ్డి రాఘువేంద్రమ్మ దంపతులు తన మనవడు పుట్టినరోజులను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకొని మంత్రాలయం మండలంలోని సౌలహల్లి గ్రామంలోని శివాలయంలో పౌర్ణమి రోజు హోమం, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు ఏర్పాటుచేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయితే గత మూడు రోజులుగా దుబాయిలో యుద్ధ వాతావరణం నిలవడంతో ఎక్కడపడితే అక్కడ బాంబులు వర్షం కురుస్తుండడంతో సామాజిక మాధ్యమాలు టీవీల్లో చూడడంపై వారు స్పందిస్తూ మేము అనుకోకుండా దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చామని అయితే అక్కడ జరుగుతున్న యుద్ధాన్ని చూస్తే ఆ దేవుడు సంకల్పమే మమ్ములను స్వగ్రామానికి వచ్చి మా కుమారుడి పుట్టినరోజు వేడుకలు జరుపుకునేలా చేశారని తల్లిదండ్రులు దివ్య రెడ్డి, తిప్పారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మిగనూరు మురహరి రెడ్డి, వచ్చారు. మరియు సౌలహల్లి నాయకులు లక్ష్మిరెడ్డి, నర్సిరెడ్డి, తదితర గ్రామ నాయకులు ఉన్నారు

# పాఠశాల ముందర చెరువుకు కంచ ఏర్పాటు చేయండి సార్

**పిల్లల తల్లితండ్రుల ఆవేదన**

**శాంతిపురం రిపబ్లిక్ న్యూస్ మార్చి 3**
శివరాంపురం పంచాయతీ గట్టూరు గ్రామం నందు శాంతం పల్లి పోవు రోడ్డు చెరువు కట్ట రోడ్డు మలుపులు ఎన్నోసార్లు ప్రమాదాలకు గురైన చిన్న పిల్లలు వయసు అయిన పెద్దవాళ్లు ఎన్నోసార్లు ప్రమాదానికి గురై నారు ఈ విషయం పైన సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు కాబట్టి దయవుంచి ఈ చెరువు కట్టు నీరు నిండిపోవడం వల్ల లోతు ఎక్కువగా ఉండడం పక్కనే గవర్నమెంట్ హై స్కూల్ ఉంది అక్కడ పక్కనే పిల్లలు ఆడుకునే ప్లే గ్రౌండ్ అక్కడే ఉంది గనుక నీరు కూడా నిండే పోయి ఉండడం చాలా ప్రమాదకరం మరియు పిల్లలు 6 నుంచి 10 దాకా చదివే పిల్లలు సైకిల్ తొక్కుకుంటూ మోటార్ సైకిల్ తోలుకుంటూ జారిపడే అవకాశాలు ఉంటాయి కాబట్టి దయవుంచి సంబంధిత అధికారులు ఈ విషయంపై స్పందించి అక్కడ ప్రమాదాలకు గురి కాకుండా చిన్న చిన్న





పిల్లర్లు మరియు కంచెలు అమర్చాల్సిందిగా అక్కడ చదువుకుంటున్న చిన్నపిల్లల తల్లిదండ్రులు మరియు గట్టూరు గ్రామస్తులు శివరాంపురం గ్రామస్తులు కోరుకుంటున్నారు



# గుండెపోటు వ్యక్తికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేత

## అందించిన ఏపీ ఎస్ యూ యూనియన్,టౌన్ జర్నలిస్టులు



**అనంతపురం క్రైమ్,మార్చి 03,( రిపబ్లిక్ న్యూస్ ):** గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి మంగళవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని మెరుగైన వైద్యం కోసం అనంతపురం నగరంలోని మార్క్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు ఆపరేషన్ చేసి 2 స్టంట్ లు వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య స్థితి నిలకడగానే ఉంది. మంగళవారం అనంతపురం టౌన్ ఏపీ ఎస్ యూ యూనియన్, టౌన్ రిపోర్టర్లు కలిసి మార్క్ ఆసుపత్రిలో ఎర్రిస్వామి భార్య సంధ్యకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త ఎర్రిస్వామికి అండగా నిలిచిన రిపోర్టర్ లందరికీ సంధ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో ఉంటూ అందరిలో కలిసిపోయే వ్యక్తి ఎర్రిస్వామి అని అలాంటి వ్యక్తికి గుండెపోటు రావడం బాధా కరమన్నారు.అందరం కలిసి ఎర్రిస్వామికి అండగా ఉండాలని వారు కోరారు. ఆసుపత్రిలో వారం రోజులపాటు ఉండి చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. తోటి జర్నలిస్టులు మిత్రులు, బంధువులు కలిసి కొంత సాయం అందిస్తే మరింత భరోసా కల్పించిన వారమవుతామన్నారు. సహాయం అందించేవారు ఎర్రిస్వామి భార్య సంధ్య ఫోన్ పే నెంబర్ 9848399948 కు సాయం అందజేయాలని వారు కోరారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి రాజ్యం..!



## ప్రభుత్వ చలానాకు మించి దండిగా వసూళ్లు

## నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై సంచలన ఆరోపణలు

**ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో బయటపడిన అక్రమాలు**

**అదనపు డబ్బు లేకుంటే రిజిస్ట్రేషన్‌కు బ్రేక్**

**మధ్యవర్తుల హవా కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల దందా**

**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కఠిన హెచ్చరికలు**

**కల్లూరులో సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 3)** జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి బహిరంగ రహస్యంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం నిర్ణయించిన చలానా రుసుముతో పాటు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా సేకరించిన ఫీడ్‌బ్యాక్‌లోనూ అనేక ఫిర్యాదులు నమోదైనట్లు తెలుస్తోంది.

### అదనపు రుసుము లేకుంటే పనులు పెండింగ్

అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ 'అదనపు చెల్లింపు' చేయకపోతే రిజిస్ట్రేషన్ పనులను నిలిపివేయడం, చిన్న చిన్న లోపాలు చూపుతూ ఆలస్యం చేయడం జరుగుతోందని బాధితులు చెబుతున్నారు. పత్రాల్లో స్వల్ప లోపాలు ఉన్నా భారీగా అక్రమ వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు?

ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన వక్ఫ్ బోర్డు భూములు, ప్రభుత్వ భూములు తదితర స్థలాల రిజిస్ట్రేషన్లు కొన్ని చోట్ల జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. అలాంటి రిజిస్ట్రేషన్లకు భారీ ముడుపులు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇలాంటి కేసుల్లో ఉద్యోగులపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి.

### మధ్యవర్తుల హవా

కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్ల పేరుతో ప్రైవేటు వ్యక్తులు తిరుగుతూ ప్రజలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిషేధిత భూముల వ్యవహారాల్లో వీరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ వ్యవహారం ఇంతకాలం కొనసాగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కలెక్టర్ కఠిన హెచ్చరిక

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. శృతి గత నెల 7న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ రిజిస్ట్రార్లతో సమీక్ష నిర్వహించారు. అదనపు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా ప్రజలు స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశించారు.

### కల్లూరులో సస్పెన్షన్ వేటు

గత నెలలో కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాఘవేంద్ర అనే సీనియర్ అసిస్టెంట్‌ను నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ ఆరోపణలపై సస్పెండ్ చేశారు. ఇదే తరహాలో మరికొన్ని కేసులను అధికారులు పరిశీలిస్తున్నారు. లోపాలు తేలితే మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

### డీఐజీ స్పందన

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్ల పేరుతో వ్యవహరించే వారి వల్లే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు నేరుగా కార్యాలయాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. త్వరలో కార్యాలయాలకు వచ్చిన వారి నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరణ ప్రారంభిస్తామని తెలిపారు. బదిలీలు కూడా త్వరలో ఉంటాయని వెల్లడించారు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి అరికట్టి పారదర్శక వ్యవస్థను నెలకొల్పాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించడంలో అధికారుల విఫలం: కె. వి. నారాయణ




**ఓర్వకల్ ప్రతినిధి, మార్చి 03,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** మంగళవారం రోజున కర్నూలుజిల్లాలో గ్రామీణ ప్రాంతాల పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని, వలసలు అరికట్టి ఉపాధి హామీ పనులు కల్పించేందుకు కృషి చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి నారాయణ అన్నారు. స్థానిక కె కె భవన్ లో సంఘం కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండల బాధ్యుల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. నాగన్న అధ్యక్షతన జరిగింది. అనంతరం కె వి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పనులు తగ్గిపోయి వేలాది మంది పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు, మరి కొన్ని చోట్ల పనులు ఎక్కడ ఉంటే అక్కడి కి వెళుతున్నారు ఈ నేపథ్యంలో ఆస్పరి మండలం పుటకలమర్రి గ్రామంలో పేదలు పనులకోసం వెళుతూ ఆటో బోల్తా కొట్టి 43 మంది గాయాల పాలైనారు, ఇలాంటివి అనేక ప్రాంతాలలో జరుగుతున్నాయి ప్రమాదాల బారి నుండి పేదలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులు, పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు, వలసలు అరికట్టి ఉపాధి పనులు కల్పించేందుకు జిల్లా వ్యాపితంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు, అలాగే మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.సమావేశంలో కర్నూలు మండల కార్యదర్శి గోపాల్, కల్లూరు మండలం కార్యదర్శి శ్రీనివాసులు, ఓర్వకల్లు మండల నాయకులు శేషయ్య మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

# ఎనిమిది కోట్ల ప్రభుత్వ స్థలం.... కబ్జా

## -- కోనేరు నాగేంద్ర ప్రసాద్



**ఎమ్మిగనూరు, మార్చి, 3(,రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు పట్టణంలో అధికార పార్టీ కబ్జాల కథలు అందరికీ తెలిసిందే. ఎన్ని విమర్శలు చేసినా అధిష్టానం పట్టించుకోకపోవడం, అధికారులు కబ్జాదారులకు సహకరించడం, విమర్శలు వచ్చినా డబ్బు దోచుకోవాలన్న లక్ష్యంతో నాయకులు ప్రవర్తించడం మనం చూస్తున్నావే. ప్రస్తుతం ఎనిమిది కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం ప్లాట్లు వేయడానికి సిద్ధంచేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని లెదర్ సొసైటీ వెనుక సర్వే నంబర్ 37 లో మూడు ఎకరాల ఎనిమిది సెంట్ల స్థలం "కుంట పోరంబోకు" గా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు గురువుతోందని దాన్ని రక్షించాలని నేను 2022 లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా ఆదోని సబ్ కలెక్టర్ భూమి సర్వే నిర్వహించి అది ప్రభుత్వ భూమిగా సూచిస్తూ బోర్డు పెట్టించడం జరిగింది. ఈ భూమి పక్కనుండి మంత్రాలయం బైపాస్ రోడ్డు మంజూరు కావటంతో భూమి విలువ ఎనిమిది కోట్లకు పైగా పెరిగింది. ఈ భూమిపై ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటి పై కె. ఇర్షాద్ దొంగ రిజిట్రేషన్ చేసుకోవడం కూడా జరిగిపోయింది. ఈ భూమిని "అప్నా" అండతో గరుసు వేయించి ఇళ్ళ ప్లాట్లకు సిద్ధంచేస్తున్నారు. తహసీల్దారు, మున్సిపల్ కమీషనర్ తమకు పట్టనట్టు సహకరిస్తున్నారు. తక్షణం జిల్లా కలెక్టర్ కల్పించుకొని స్థలాన్ని స్వాధీనం చేసుకొని దొంగ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి. సహకరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి. కబ్జా పై ఎమ్మెల్యే నాగేశ్వర రెడ్డి సమాధానం చెప్పాలి.

# ఓబులవారిపల్లెలో యువకుడు ఆత్మహత్య.



**ఓబులవారిపల్లి మార్చి 3 రిపబ్లిక్ న్యూస్.** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండలం లో ఉన్న ఓబులవారిపల్లి గ్రామానికి చెందిననూక సుబ్రహ్మణ్యం రెడ్డి కుమారుడు నూక రాకేష్ రెడ్డి వయసు 24 సంవత్సరాలు సోమవారం రాత్రి ఉరివేసుకొని ని తన నివాసములు ఆత్మహత్య చేసుకున్నట్లు ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి మృతుడు కుటుంబం రాజంపేటలో నివాసం ఉండేవారని సోమవారం ఉదయం ఇంటికి వెళుతున్నానని తల్లితో చెప్పి ఓబులవారిపల్లి వచ్చారని ఆ తర్వాత. ఇంట్లో ఉన్నాను అమ్మా అని ఉదయం చెప్పారని ఆ తర్వాత ఫోన్ చేస్తే మంగళవారం ఉదయం ఫోన్ తీయడం లేదని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి చూడగా చెప్పులు బయట లేవని మూడు గంటలకు తర్వాత చూస్తే ఇంటిలో శవం అయ్యి ఉన్నట్లు తెలిపారు ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు కిటికీలోనుంచి చూశారని ఆ తర్వాత తలుపులు పగలగొట్టి విషయం తెలుసుకున్నారన్నారు మృతుడు బాగా చదువుకున్నారని ఎలా మృతి చెందింది ఎందుకు ఆత్మహత్య చేసుకుంది ప్రేమ వ్యవహారం లేదా ఇంకేమైనా విషయాలు ఉన్నాయని ఆరా తీస్తున్నామని అన్నారు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు మృతుడు యువకుడు కాబట్టి ఓబులవారిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి మంచికి మారుపేరు అని వారి తల్లిదండ్రులు కూడా ఎంతో మంచివారిని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## అంగన్వాడి మహిళల అక్రమ అరెస్టులకు నిరసనగా

# రైల్వే కోడూరులో సిఐటియు ధర్నా, రాస్తారోకో






**ఓబులవారిపల్లి మార్చి 3రిపబ్లిక్ న్యూస్.** విజయవాడ ధర్నా చౌక్ లో తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం అంగన్వాడీలు రెండో తేదీ నుండి, నిరవధిక ధర్నా చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున పోలీస్ బలగాలు హుటాహుటిన నిద్రలో ఉన్న అంగన్వాడీలపై దాడి చేసి టెంట్లు పీకి గుండుసూదులతో గుచ్చి మహిళలని చూడకుండా, అక్రమంగా అరెస్టు చెయ్యడాన్ని ఖండిస్తూ తిరుపతి జిల్లా, రైల్వేకోడూరులో, సిఐటియు ఆధ్వర్యంలో, ఐసిడిఎస్, ప్రాజెక్టు నుంచి, గాంధీ విగ్రహం వరకు, భారీ ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి, రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించబోయింది, అర్థగంట తర్వాత, ఎస్సై, పోలీసులు వచ్చి, సిఐటియు నాయకుల్ని అరెస్టు చేస్తుంటే, అంగన్వాడి మహిళలు అడ్డుకున్నారు. సిఐటియు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సిహెచ్.చంద్రశేఖర్, అంగన్వాడి యూనియన్, జిల్లా అధ్యక్షురాలు, ఎస్ శ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు, ఆర్ వెంకటేష్, పాల్గొని వారు మాట్లాడుతూ అంగనవాడీలకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం జీతాలు పెంచుతామని సమస్యలు పరిష్కారం చేస్తామనే హామీ మేరకు అనేక సందర్భంలో అధికారులకు నాయకులకు సమస్యలు పరిష్కారం జీతాలు పెంచాలని వినతి పత్రాలు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో, 42 రోజుల సమ్మె సందర్భంగా, అప్పటి మినిస్టర్స్, ప్రభుత్వ అధికారులు, జూన్లో వేతనాలు పెంచుతామని, రాత మూలకంగా అగ్రిమెంట్ ఇచ్చారన్నారు. దాన్ని ఏ ప్రభుత్వమైనా అమలు చేయాల్సింది అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్, తామ అధికారంలోకి వస్తానే, కనీస వేతనం పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. కుప్పంలో స్వయంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు, అంగన్వాడీల దీక్షా శిబిరానికి వచ్చి, తమ ప్రభుత్వం వస్తేనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండు సంవత్సరాలైనా వేతనాల పెంచకపోవడం, బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం, ఆందోళన చెందిన అంగన్వాడీలు, ఇచ్చిన హామీని అమలు చేయమని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. శాంతియుతంగా, రెండు రోజులు పరిమిషన్తో, ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహిస్తుంటే, తెల్లవారుజామున, ప్రభుత్వ ఆదేశాలతో, పోలీసులు, అంగన్వాడి మహిళలను అక్రమంగా, అరెస్టు చేయడం, దుర్మార్గం అన్నారు.ఆ దాడిలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిఐటియు నాయకురాలు బేబీ రాణి చెయ్యి విరగడం, పోలీసుల దౌర్జన్యం దమనకండకు నిదర్శనం అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, అంగన్వాడీల కనీస వేతనం అమలు చేసి, ఎన్నికల వాగ్దానం నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే గత ప్రభుత్వం లాగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు మండల కార్యదర్శి, పి. జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కా,ర్యదర్శి నగిరిపాటి ఆనంద్, ఓబులవారిపల్లి, సిఐటియు మండల కన్వీనర్, నాగిపోగు పెంచలయ్య, కోడూరు ప్రాజెక్టు, అధ్యక్షురాలు, రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, శిరీష, దుర్గా, వెన్నెల, లేబాకు కుమారి, లీలావతి, కౌసల్య,నాగరాజమ్మ, ఈశ్వరమ్మ, సుజాత, రోజా,వనజ, సునీత, వాణి, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.ఎస్ఎఫ్ఐ. జిల్లా నాయకులు, ఎస్ లతీఫ్, పాల్గొని సంఘీభావం తెలిపారు



# హార్మూజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !

**న్యూఢిల్లీ, మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
పిల్లికి చెలగాలటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రాచ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరించింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లలో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా,అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్మూజ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది. ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళు




తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హార్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హార్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్ల చమురు హార్మూజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్‌జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హార్మూజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరిచిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది. ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హార్మూజ్ జలసంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హార్మూజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుందనుకోవడానికి లేదు. అందువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

# ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

## ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించినట్లు ప్రచారం -కమేనీ కదలికలను గుర్తించి..పక్కాగా బాంబింగ్

**న్యూఢిల్లీ, మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
ఆధునిక యుద్ధవిద్యలో ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం సాధించాయని విదేవీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టా÷-గ్గ÷ట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్



సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని
ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

# క్షేమంగా ఇండియా చేరుకున్న పివి సింధు

## బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన షట్లర్

బెంగళూరు **మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు. ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.




# తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

## అమెరికా నెత్తిన భారీగా భారం పడడం ఖాయం -ఇప్పటికే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు

**వాషింగ్టన్,మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**
'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే.

ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం



వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట. అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియా లో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన
కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత అన్న భయాలు కలుగుతున్నాయి. ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బ్జడెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం.

# ఖమేనీ హత్యపై మౌనమెందుకు?

## మోడీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ

**న్యూఢిల్లీ,మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):** ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్చిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసపినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాం÷-రతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

# అమెజాన్ డేటా సంటర్లపై డ్రోన్ దాడి

## ధృవీకరించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్

**టెహ్రాన్,మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):** :అమెరికా- ఇజ్రాయెల్ సైనిక చర్యలకు ప్రతీకారంగా పశ్చిమాసియాపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలో అక్కడి అమెజాన్ డేటా సెంటర్‌లపై డ్రోన్ దాడులు జరిగినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ దాడులు నిజమేనని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ధ్రువీకరించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని తమ రెండు డేటా సెంటర్లను డ్రోన్‌లు నేరుగా ఢీకొట్టాయని అమెజాన్ పేర్కొంది. దీంతో పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ సర్వీసుల్లో అంతరాయం కలిగినట్లు తెలిపింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్ సమీపంలో జరిగిన దాడి వల్ల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో ఉద్యోగులు ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనే విషయం గురించి సంస్థ స్పష్టం చేయలేదు. సర్వీసుల పునరుద్ధరణకు తమ సిబ్బంది స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పింది. సర్వీసుల్లో అంతరాయం కారణంగా ప్రభావితమైన వినియోగదారులు కీలకమైన డేటాను బ్యాకప్ చేసుకొని.. ఇతర ప్రాంతాల్లోని అమెజాన్ సర్వీసులకు మారాలని సూచించింది.

# వైద్యుల నిర్లక్ష్యం .. శిశువు మృతి

**ఐసీయూలో బాలింత .. తల్లడిల్లిన కుటుంబం**

**ప్రసవానికి ఆసుపత్రికి వస్తే .. ప్రాణం తీశారు**

**శిశువు మరణానికి వైద్యుల సమన్వయ లోపం**

**కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు**

**వైద్యుల నిర్లక్ష్యమే నా బిడ్డ మృతికి కారణం**

**ఆ పసి బిడ్డ తండ్రి ఆవేదన**





మృతి చెందిన శిశువుని ఎత్తుకొని రోధిస్తున్న కుటుంబ సభ్యులు


ఐసీయూలో అపస్మారక స్థితిలో శిశువు తల్లి (లక్ష్మీదేవి)


వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన శిశువు

**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 03, అనంతపురం**

బిడ్డ కడుపున పడినప్పటినుండి ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. రెక్కల కష్టం చేసుకుని రూపాయి రూపాయి కూడగట్టుకున్న డబ్బులతో వైద్యం చేయించుకున్నారు. కానీ ప్రసవానికి దగ్గరగా పడుతున్న రోజులలో పుట్టే బిడ్డను కళ్ళారా చూసి ఆనందంలో మునిగి పోవాలనుకుంది. గర్భంలో తిరుగుతున్న బిడ్డను చూసి మురిసిపోయింది ఆమె .ఎప్పుడు పుడతాడా అని వేయి కళ్ళతో ఎదురుచూసిన ఆమెకు నిరాశే మిగిలింది. కాలం ఆమెకు విధి వంచన అయింది. ఏ జన్మలో ఏ పాపం చేసుకుందో ఏమో తెలియదు కానీ. ఓ నిండు గర్భిణికి పుత్రసోకం మిగిలింది. నవ మాసాలు మోసి పెంచిన ఓ కన్నతల్లి పేగు బంధాన్ని వైద్యులు చిదివేశారు. కానీ ఆ తల్లికి తెలియకుండానే గర్భంలోనే బిడ్డను చంపేశారు. సర్వ జన ఆసుపత్రి వైద్యులు ఆ కుటుంబానికి తీరనిష్టం కలిగించారు. పుత్రసోకంతో ఆ కుటుంబం ఆర్తనాధాలు
అక్కడున్న వారిని కలచివేశాయి. ఈ సంఘటనను కల్లారా చూసిన తోటి మహిళలు గుండెలవిసేలా రోదిస్తున్న సంఘటన అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చోటు చేసుకుంది.

## ప్రసవం కాక .. కడుపులోనే శిశువు మృతి

అనంతపురం రూరల్ సోమల దొడ్డి పరిధిలోని బిజెపి కాలనీకి చెందిన లక్ష్మీదేవి భర్త దామోదర్ కుటుంబ సభ్యులు గత శుక్రవారం ఆమె ప్రసూతి కోసం ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. గత ఐదు రోజులుగా ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేశారు. గర్భిణి కండిషన్ బాగుందని ఏ సమస్య లేదని వైద్యులు చెప్పడం జరిగింది. ఇంతకుముందు లక్ష్మీదేవి నార్మల్ డెలివరీ చేయించుకుందని వైద్యులు తెలిపారు. ఇప్పుడు కూడా నార్మల్ డెలివరీ చేయాలని నిర్ణయించిన వైద్యులు తీరా సోమవారం అర్ధరాత్రి దాటాక నిండు గర్భిణీకి నొప్పులు రావడంతో బయట నుంచి ఒక ఆయింట్మెంట్ తీసుకువచ్చి వాడడం జరిగింది. అర్ధరాత్రి సమయం దాటాక లక్ష్మీదేవికి నొప్పులు రాకపోవడంతో వైద్యులు నిర్లక్ష్యం చేశారు. ఒక డ్యూటీ వైద్యులు సిజేరియన్ చేద్దామని తోటి వైద్యులతో చెబితే లేదు లేదు ఇంతకుముందు కూడా ఈమెకు మూడు నార్మల్ డెలివరీలు చేశామని తెలపడం జరిగింది. ఇప్పుడు కూడా నార్మల్ డెలివరీ చేద్దామనీకొన్నారు. అనంతరం వైద్యులు సరైన సమయంలో వైద్య సేవలు అందించకపోవడంతో ఆమె ప్రసవం కాక .. శిశువు కడుపులోనే మరణించడం జరిగింది.

## డ్యూటీ డాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహారం

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు సమన్వయ లోపంతో పసికందును చంపేశారు. ప్రసూతి కోసం ఆసుపత్రికి వస్తే శిశువు ప్రాణం తీసేసారు. నిండు గర్భిణీకి వైద్య పరీక్షలు, స్కానింగ్ తదితర వాటిలో ఏ సమస్య ఉన్నా కుటుంబ సభ్యులకు వైద్యులు తెలియజేయాల్సి ఉంది. వైద్య నిమిత్తం పేషంట్ తో పాటు కుటుంబ సభ్యులను సాధారణంగా అనుమతించాల్సి ఉంది.
ఏ ఒక్క కుటుంబ సభ్యులను నిండు గర్భిణీ వైద్య పరీక్షల సమయంలో.. తిరిగి ఆమెకు ప్రసూతి నొప్పులు కలిగినప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేయాల్సి ఉన్నా.. ఇవేవీ తమకు వర్తించవన్నట్లు వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పేషంట్ దరిదాపుల్లోకి కూడా కుటుంబ సభ్యులను అనుమతించిన పాపాన పోలేదు.
దీంతో నిండు గర్భిణీ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. వైద్యులు చూడాల్సి ఉండగా.. ఎవరెవరు వచ్చి వైద్యం చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అదేమని అడిగితే పేషంట్ కుటుంబ సభ్యులను సదరు వ్యక్తులు కోపంతో అరుస్తున్నారు. సర్వజన ప్రభుత్వాసుపత్రిలో గందరగోళం, భయాందోళనకు గురవుతున్న కుటుంబ సభ్యుల కన్నీటి గాథలు వర్ణనాతీతం. వైద్యం చేసే తరుణంలో వీరు వైద్యం అందచేయకుండా.. ఆ సమయంలో సిబ్బందిని ఉంచి వైద్యులు కనుమరుగవుతున్నారు. డ్యూటీ లో ఉండాల్సిన వైద్యులు ఇష్టారాజ్యంగా సర్వజన ఆస్పత్రిలో వ్యవహరిస్తున్నారు.

## సరైన సమయంలో వైద్యం అందించి ఉంటే బ్రతికేవాడు

శిశువు మృతి చెందడంతో ఆ కుటుంబం నిస్సహాయ స్థితిలో ఉంది. నాకు జరిగిన అన్యాయం ఏ కుటుంబానికి జరగకూడదని ఆ శిశువు తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. వైద్యులు అంటే దేవునితో సమానమే.. కానీ సరైన సమయంలో సరైన వైద్యం అందించి ఉంటే నా బిడ్డ బతుకేవాడని గుండెలు బాదుకుని ఏడుస్తున్నాడు.
ఇది చూసిన ప్రతి ఒక్కరి కళ్ళల్లో నుంచి నీళ్లు రాలుతున్నాయి.ప్రసూతి సమయంలో వైద్యులు శిశువుని ఎలా పడితే అలాగ లాగడంతో మృతి చెందింటాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నాడు. లేక సిజేరియన్ సమయంలో వైద్యులు ఇష్టాసారంగే వ్యవహరించి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశాడు. ఓ పక్క తన బిడ్డ మృతితో.. మరోపక్క భార్య ఐసీయూలో ఉన్న సంఘటనను జీర్ణించుకోలేక



వైద్యుల నిర్లక్ష్యమే నా బిడ్డ మృతికి కారణం .. దామోదర్

నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి. మూడు సహజ ప్రసూతితో ఇద్దరు కూతుర్లను బతికించుకున్నానని, ఇప్పుడు బేబీ బరువు ఉండడంతో వైద్యులు సిజేరియన్ చేస్తామని చెప్పి, నిర్లక్ష్యం చేయడం వల్లనే నా బిడ్డ చనిపోయాడని కన్నీరు మున్నీరయ్యాడు.

## శిశువు మృతితో కుటుంబ సభ్యుల రోదన

శిశువు మృతితో కుటుంబ సభ్యుల రోదన సర్వజన ఆస్పత్రిలో మిన్నంటాయి. ఇంతకుముందు వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించామని. అయితే ఏ ఆసుపత్రిలోనూ ఆమెకు ఫలానా సమస్య ఉంది అని వైద్యులు ఎక్కడ చెప్పలేదు అన్నారు. కానీ ఇప్పుడు వైద్యులు సరిగా ఆహారం తినకపోవడం వల్లే ఆమె అనారోగ్యంగా ఉందని, బిడ్డ చనిపోయిన తర్వాత ఇలా చెప్పడం సరైన పద్ధతేనా అని ప్రశ్నించాడు. నాలుగో కాన్పు కాబట్టి ఆమె బలహీనంగా ఉందని డాక్టర్లు చెబుతున్నారని అయితే అనారోగ్యంగా ఉన్న ఆమె పట్ల వైద్యులు మెరుగైన చికిత్స కోసం బయట ఆసుపత్రులకు వెళ్ళండి అని చెప్పి ఉంటే కనుక వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం ఎవరో ఒకరి కాళ్లు పట్టుకొని నా బిడ్డను బతికించుకునే వాడిని నేను అని కన్నీరు మున్నీరయ్యారు బిడ్డ తండ్రి . ఒక డాక్టర్ ఏమో నార్మల్ డెలివరీ చేయాలని చెప్తారు.. మరో డాక్టర్ వచ్చి సిజేరియన్ చేయాలని చెప్తారు. ప్రసూతి సమయంలో ఏ వైద్యం అందించాలో తెలియని స్థితిలో వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నారంటే సిగ్గుచేటు. బిడ్డ చనిపోయిన తర్వాత తల్లిదండ్రుల చేతిలో పెట్టి వైద్యులు చేతులు ఎత్తేశారు. ఆమెకు గర్భసంచి కూడా తొలగించారు.
ప్రస్తుతం బిడ్డకు జన్మనిచ్చిన తల్లి అపస్మారక స్థితిలో ఉంది.
వైద్యుల సమన్వయ లోపమే శిశువు మృతికి కారణం అని చెప్పవచ్చు.

## శిశువు మృతి పై సమగ్ర విచారణ చేపడతాం

**సర్వజన ఆసుపత్రి సూపర్డెంట్**

సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటపైన శిశువు మృతి చెందిన సంఘటన చాలా బాధాకరమన్నారు. ఈ మృతికి సమగ్ర సమాచారం వైద్యుల వద్దే ఉంటుందని ఆమె తెలిపారు. ప్రసూతిలో క్రిటికల్ కండిషన్ ఉన్నప్పుడు వైద్యులు నిండు గర్భని కండిషన్ దృష్టిలో ఉంచుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపడతామని, కచ్చితంగా వైద్యుల నిర్లక్ష్యమని తేలితే చర్యలు తప్పవన్నారు.

## చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**సర్వజన ఆసుపత్రి హెచ్ ఓ డి**

నిండు గర్భిణీ నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన విషయం వాస్తవమే. అయితే ఉమ్మనీరు తక్కువ ఉండడం వల్ల ప్రమాదం సంభవించిందన్నారు. బేబీ హార్ట్ బీట్ తక్కువ ఉందని ఆమె తెలిపారు. బేబీ మృతి బాధాకరం
అని, ఇలాంటి సంఘటన ఏ తల్లికైనా కడుపుకోతనే మిగిలిస్తుందని ఆమె బాధపడ్డారు. బేబీ మృతికి వైద్యుల
సమన్వయ లోపం ఉంటే గనుక కచ్చితంగా చర్యలు చేపడతాం అని అన్నారు. కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపడతాం అనంతరం జిల్లా కలెక్టర్ వారికి నివేదిక అందజేస్తామన్నారు.

## జిల్లా కలెక్టర్ సర్వజన ఆసుపత్రి పై దృష్టి పెట్టండి

పేదలు వైద్యం కోసం నిత్యం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వందల సంఖ్యలో వస్తుంటారు. అయితే వైద్యులు సరైన సమయంలో సరైన వైద్యం అందజేయక నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరు వైద్యుల నిర్లక్ష్యం వల్ల సర్వజన ఆసుపత్రికి చెడ్డపేరు వస్తోంది. వైద్యుల సమన్వయ లోపం వల్ల విధులలో అలసత్వం వహిస్తున్నారు. కొందరు అధికారుల వైఫల్యం వల్ల పసిపిల్లల ప్రాణాలు పోతున్నాయి. దీంతో ఆ కుటుంబాలు చితికి పోతున్నాయి.జిల్లా కలెక్టర్ చొరవ చూపి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి సారించి బాదులైన అధికారులపై ఇప్పటికైనా చర్యలు చేపట్టండి.

# వేతనాలు పెంచమంటే అరెస్టు చేస్తారా

**ప్రశ్నించినందుకు చేతులు విరగ్గొడతారా**

**మహిళలను అవమానపరచడమా**

**ప్రతిపక్షంలో ఇచ్చిన హామీ ఏమైంది**

**వేతనాలు పెంచేంతవరకు పోరాటం ఆగదు**

**నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదు**




**అనంతపురం సంక్షేమం, మార్చి 03,(రిపబ్లిక్ న్యూస్):**

వేతనాలు పెంచమంటే అంగనవాడి మహిళలను అరెస్టు చేస్తారా అని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు హెచ్చరించింది. మంగళవారం వీరి ఆధ్వర్యంలో నగరంలోని టవర్ క్లాక్ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ వి నాయుడు, ఎస్. నాగేంద్ర కుమార్ తదితరులు మానవహారం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బేబీ రాణి చెయ్యి విరగడం చాలా దురదృష్టకరం**

ఈ సందర్భంగా వారు మాట్లాడారు అంగన్వాడీ మహిళా కార్మికుల కుటుంబాల పోషణ కోసం, గౌరవప్రదమైన జీవనానికి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సామాజిక భద్రత కల్పించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారిని తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ అహంకారానికి పరాకాష్ట అని ఆయనన్నారు. అక్రమ అరెస్టులను అడ్డుకునే ప్రయత్నం చేసిన అంగనవాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి చెయ్యి విరగడం చాలా దురదృష్టకరమన్నారు.ఇది కేవలం అరెస్టు కాదు మహిళల గౌరవాన్ని అవమానపరచడమే అని, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడం అని మండిపడ్డారు.

**హామీలు అమలు చేయమంటే బెదిరింపులా**

విజయవాడలో శాంతియుత ధర్నా చేస్తున్న అంగన్వాడీలపై ఉదయం 6 గంటలకు దాడి చేసి అరెస్టులు చేయడం ఏ విధంగా సమర్థనీయం..వేతనాలు పెంచమంటే అరెస్టులా..ఇచ్చిన హామీలు అమలు చేయమంటే కేసులా ప్రశ్నిస్తే బెదిరింపులా ఇదేనా ప్రజాస్వామ్య పాలన ..అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.గతంలో 42 రోజులపాటు అంగన్వాడీ కార్మికులు చారిత్రాత్మక సమ్మె చేసినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం రాజకీయ వంచన కాదా అని నిలదీశారు. అంగన్వాడీల కష్టాలు ముఖ్యమంత్రికి కనిపించడంలేదా వినిపించడంలేదా అని ప్రశ్నించారు.

**సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయండి**

పెండింగ్లో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్గ్రేడ్ చేయడం, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించడం, గ్రాట్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించడం, అదనపు యాప్ పనిభారం తగ్గించడం, సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయడం, ప్రతి సెక్టార్కు సిబ్బంది నియామకం, సురక్షిత వసతి కల్పించడం వంటి న్యాయమైన కోర్కెలను అమలు చేయకుండా నిర్బంధాలు ప్రయోగించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు నెరవేర్చేంతవరకు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అరెస్టులు చేసినా ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదని, అంగన్వాడీల గళాన్ని ఎవరూ అణచలేరని, వేతనం పెంచేంతవరకు ఉద్యమం ఆపే ప్రసక్తి లేదని




ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, గోపాల్, రామ్ రెడ్డి,నాగభూషణం, రామాంజనేయులు, ముత్తుజ వెంకటనారాయణ, శివప్రసాద్, శ్రీనివాసులు, మధు, పెద్దన్న ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్ ,గిరి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాత్యాయని, అరుణమ్మ, సుశీల, షాహినా, అలాగే ఐద్వా నాయకులు శ్యామల, అశ్విని మరియు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు హాజరయ్యారు.



# ఐబీపీఎస్, ఆర్ఆర్ బి ఆఫీసర్స్ బ్యాంక్ ఉద్యోగాలల్లో

# గురు రాఘవేంద్ర విద్యార్థుల ప్రభంజనం



**నంద్యాల ఫిబ్రవరి 3 (రిపబ్లిక్ న్యూస్) :**

ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 2025 అకడమిక్ సంవత్సరానికి గాను రీజినల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్ బి) ఐబీపీఎస్ బ్యాంకుల నందు 70 ఆఫీసర్స్ ఉద్యోగాలను సాధించినట్లుగా గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డా.పి దస్తగిరి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ ఆవరణలో ఉద్యోగాలను సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేయడమైనది. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి. మౌలాలి రెడ్డి మాట్లాడుతూ మాకున్న ఒకే బ్రాంచ్ లో దేశంలోనే అధికంగా ఆఫీసర్స్ మరియు క్లరికల్ ఉద్యోగాలను మా విద్యార్థులు సాధించారని తెలిపారు. 1989వ సంవత్సరం నుండి 2026వ సంవత్సరం వరకు మా కోచింగ్ సెంటర్ నుండి 44,000 వేల మంది విద్యార్థులు బ్యాంకు ఉద్యోగాలను సాధించారు. నేటితరం విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యావిధానాలతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాము అనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. అని తెలుపుతూ విద్యార్థుల విజయాలను ప్రశంసించారు. 2026 సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో వేలాదిగా ఆఫీసర్స్ మరియు క్లరికల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడుచున్నవి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న యువతీ, యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనతి కాలంలో బ్యాంకు ఉద్యోగులుగా స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నాము. సమాజానికి తమ వంతుగా కృషి చేయాలనే సదుద్దేశంతో నిరుద్యోగ యువతీ యువకులకు అతి తక్కువ ఫీజులతోనే ఉద్యోగం వచ్చేంతవరకు శిక్షణ అందిస్తున్నాము. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మరియు టీచింగ్ ,నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com